క్లుప్తంగా

పాఠశాలలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో నేరడిగొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది 23 మంది విద్యార్థినుల రక్త నమూనాలు సేకరించారు. ఈసందర్భంగా హెచ్‌ఈవో పవార్ రవీందర్ మాట్లాడుతూ వ్యాధులు దరి చేరకుండా ప్రతీ విద్యార్థి పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబరావు, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హాస్టల్ ఏఎన్‌ఎం అశ్విని పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి

నేరడిగొండ: ప్రతీరోజు గ్రామాల్లో పర్యటిస్తూ ఆశ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని నేరడిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తూనే పరిసరాల, వ్యక్తిగత శుభ్రత గురించి వివరించాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతోనే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్లు సంతోష్, స్వర్ణలత, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నైపుణ్యంతో కూడిన బోధన చేయాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన బోధన చేయాలని టీబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవేందర్, పాచ్చారెడ్డిలు అన్నారు. ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపికైన జీవశాస్త్ర ఉపాధ్యాయులను తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెరుగు సుధాకర్, రవీందర్, సుచరిత, సంతోష్, వినోద్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బోథ్: ఈనెల 9న హైదరాబాద్‌లో నిర్వహించే 17వ అఖిల భారత పద్మశాలి మహాసభలు, తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వాసాల సదాశివ్, పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్నలు కోరారు. ఈసందర్భంగా మార్కండేయ ఆలయంలో సభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సహజ వనరులను రక్షించుకోవాలి



మాట్లాడుతున్న దశరథ్ ఠాకూర్

బోథ్: సహజ వనరులను రక్షించాలని జార్ఖండ్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ సొసైటీ చైర్మన్ దశరథ్ ఠాకూర్ అన్నారు. గురువారం మండలంలోని మర్లపెల్లి గ్రామంలో గల రైతువేదికలో గ్రామస్తులు, రైతులతో 'లక్క సేకరణ'పై శిక్షణ సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సహజ వనరులను రక్షిస్తూనే వాటిని క్రమ పద్ధతిలో వాడుకోవాలన్నారు. నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించాలన్నారు. మోదుగ చెట్లకు లక్క పురుగులను కట్టితే వచ్చే లక్క చాలా విలువైందన్నారు. కార్యక్రమంలో బోథ్ ఎఫ్ఆర్‌వో ప్రణయ్ కుమార్, ఎఫ్ఎస్‌వో నాగోరావ్, ముంతాజ్, గోవింద్, పరశురామ్, సంధ్యారాణి, ధన్‌రాజ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో రోడ్డుపై కొనసాగుతున్న వారసంత



- రోడ్లపైనే నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
- రైతుబజార్ నిర్మించాలని డిమాండ్

వారసంత.. సమస్యల చింత

బోథ్: నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లో ప్రతీ మంగళవారం జరిగే వారసంతను రోడ్లపైనే నిర్వహించడంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వారసంత నిర్మించడానికి సరైన స్థలం లేకపోవడంతో మండల కేంద్రంలోని రోడ్లపైనే వారసతం నిర్వహించాల్సిన పరిస్థితి. దీని వల్ల రోడ్ల పక్కన ఉన్న కాలనీ వాసులు, వారసంతకు వచ్చే గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు ఇరుకుగా..

ప్రతీ మంగళవారం బోథ్ పట్టణంలో వారసంతం జరుగుతుంది. పాత సినిమా టాకీస్ నుంచి ఏడీసీసీ బ్యాంకు రోడ్డు, మెయిన్ రోడ్డుపై వారసంతను నిర్వహిస్తున్నారు. బోథ్ వ్యాపారస్తులతో పాటు నేరడిగొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, అదిలాబాద్, నిర్మల్, మహారాష్ట్ర నుంచి వ్యాపారులు బోథ్ వారసంతకు వచ్చి వ్యాపారం సాగిస్తారు. దీంతో వారసంత బిజీగా మారుతుంది. కూరగాయలు, ఇతర వాస్తు సామగ్రి, పండ్లు, ఆట వస్తువులు కొనేందుకు మండలంలోని గ్రామీణ ప్రాంతాల వారు, పట్టణవాసులు వస్తుంటారు. రోడ్డు వెడల్పు చాలా చిన్నగా ఉండటం వల్ల వారసంత ఇరుకుగా మారుతోంది.

పశువుల బెడద..

వారసంతలో మరో సమస్య పశువుల బెడద.. పశువులు ఏకంగా వారసంతలోకి వస్తున్నాయి. దుకాణాల్లో ఉండే కూరగాయాలు, ఇతర సామాగ్రిని పశువులు తినేస్తున్నాయి. దీంతో వ్యాపారస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు వారసంతకు వచ్చే వారు సైతం పశువుల వలన ఇబ్బందులు పడుతున్నారు. పశువులను నియంత్రించాలని, బోథ్‌లో రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

రైతుబజార్ ఏర్పాటు చేయాలి



బోథ్ మండల కేంద్రంలో రోడ్లపై జరుగుతున్న వారసంత వల్ల వ్యాపారస్తులతో పాటు, ప్రజలు కూడా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రోడ్డు చిన్నగా ఉండటం వలన ఇబ్బంది తలెత్తుతోంది. రైతు బజార్‌ను ఏర్పాటు చేస్తే అన్ని రకాలుగా సౌకర్యం ఉంటుంది.

– ఓస సాయికుమార్, బోథ్

సౌకర్యాలు కల్పిస్తాం

బోథ్‌లోని వారసంతలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తాం. పశువులను సంతలోకి రాకుండా చర్యలు తీసుకుంటాం. వారసంతకు దగ్గరగా వాహనాలను నిలపవద్దు. వ్యాపారస్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం.

– అంజయ్య, పంచాయతీ కార్యదర్శి, బోథ్

ట్రాఫిక్ సమస్య..

వారసంతను రోడ్డు మీద ఏర్పాటు చేయడంతో అటుగా వెళ్లే వాహనాల వల్ల తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. వ్యాపారస్తులు తీసుకువచ్చే వాహనాలు, వారసంతకు వచ్చే ప్రజలు తీసుకువచ్చే వాహనాలను రోడ్డు మీదే నిలుపుదల చేయడంతో ట్రాఫిక్ ఏర్పడుతోంది. దీనివల్ల రోడ్డువైపు ఉన్న కాలనీ వాసులు వారి ఇళ్లల్లోకి వెళ్లే పరిస్థితి ఉండటం లేదు. చైతన్య కాలనీ, మెయిన్ రోడ్డు, పాత సినిమా టాకీస్ వద్ద ట్రాఫిక్ ఎక్కువ అవుతోంది.

'పిండప్రదానం చేయడం సరికాదు'

ఆదిలాబాద్‌రూరల్: బీహార్ రాష్ట్రంలో బౌద్ధ గయాలోని మహాబోధి మహా విహార్‌లో బ్రాహ్మణులు కబ్జా చేసి, బుద్ధ విహార్‌లోనే హారతులు, పిండదాన కార్యక్రమాలు చేపట్టడం సరికాదని భారతీయ బౌద్ధమహా సభ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాజాడే ప్రజ్ఞా కుమార్, మధుబావల్కర్‌లు అన్నారు. బీటీ యాక్ట్ 1949ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆదిలాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచంలోని బౌద్ధులు, బౌద్ధ బిక్షువులు వేలాది సంఖ్యలో బౌద్ధ గాయాలు గత 20 రోజుల నుంచి నిరసనలు చేపడుతున్న అక్కడి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా బీహార్ ప్రభుత్వము స్పందించి బుద్ధగయ మహా బోధి బుద్ధ విహార్‌ను వెంటనే బౌద్ధులకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ సభ జిల్లా అధ్యక్షులు విఠల్, ప్రధాన కార్యదర్శి దయానంద్, జితేందర్ పవర్, రాందాస్ భలేరావ్, లలితా భాయ్ కిలారే, దయానంద్ పాల్గొన్నారు.

అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలి

తలమడుగు: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు పారితోషకంతో పాటు అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని గురువారం ఎంపీడీవో చంద్రశేఖర్‌కు పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులు గత 16 రోజుల పాటు కుటుంబ సర్వేలో పాల్గొన్ని సర్వే చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ స్పందించి సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు వినోద్ రెడ్డి, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



మాట్లాడుతున్న కంది మౌనా శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్: మెరుగైన చికిత్స కోసం ఆర్థిక స్తోమత లేని నిరుపేదలకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకురాలు కంది మౌనా శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో మహారాష్ట్రలోని ఆచార్య వినోబాభావే గ్రామీణ ఆస్పత్రి (వార్ధా)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి గురువారం ఆమె హాజరయ్యారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి, మందులు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ నిర్వాహకురాలు రేణుక బెహన్, ఓం శాంతి సభ్యులు శ్రీలేఖ, లత దేశెట్టి, ప్రభావతి, సోనియా, మంథని, ఖయ్యూం పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

ఖానాపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో సునీత అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఎండలు పెరుగుతున్నందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు పకడ్బందీగా చేపట్టాలని పేర్కొన్నారు. నర్సరీల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీలు పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సునీత

ఐరన్ మాత్రలు పంపిణీ



మాత్రలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ మాత్రలు, సి విటమిన్ మాత్రలు పంపిణీ చేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ తెలిపారు. ప్రతీ గురువారం ఐరన్ మాత్రలు, సి విటమిన్ మాత్రలు ప్రతీ విద్యార్థికి అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

కుంటాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని విఠాపూర్‌ను ఎంపిక చేయగా గురువారం గ్రామంలో 35 ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా గృహ నిర్మాణాధికారి రాజేశ్వర్ అన్నారు. మిగతా గ్రామాల్లో దశలవారీగా ఇళ్ల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఈ దయానంద్, ఎంపీడీవో లింబాద్రి, ఏఈ సవేరాం, మాజీ సర్పంచ్ గల్లపురం లక్ష్మీరమేశ్, పంచాయతీ కార్యదర్శి ఉత్తమ్, ఎఫ్ఏ సుదర్శన్, కారోబార్ లక్ష్మణ్, సుదర్శన్‌రెడ్డి, లింగారాం పటేల్, మాధవరావు, విఠల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సంగంపేట్‌లో..

సోన్: పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలంలోని సంగంపేట్ గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో సురేశ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ దశల వారీగా నిధులను విడుదల చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖలీల్ అహ్మద్, హౌసింగ్ డీఈ గంగాధర్, ఏఈ నదీమ్ పాల్గొన్నారు.



విఠాపూర్‌లో భూమిపూజ చేస్తున్న అధికారులు

నేడు ఇసుక వేలం

ఖానాపూర్: పట్టణంతోపాటు ఖానాపూర్ మండల పరిధిలో సీజ్ చేసిన 27 ట్రిప్పుల ఇసుక కు ఈనెల 7న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుజాత ఓ ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనే వారు గంట ముందు రూ. 5వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. ట్రాక్టర్ లోడ్‌కు రూ.1800 ప్రభుత్వ ధర కాగా.. దానికంటే ఎక్కువ ధరను వేలంలో చెల్లించే వారికి ఇసుక అప్పగిస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

తలమడుగు: మండలంలోని ఖప్పర్‌దేవి గ్రామంలో విద్యుత్ షాక్‌తో గురువారం మృతి చెందింది. రైతు కోరంగే జంగు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కప్పర్‌దేవి గ్రామానికి చెందిన రైతు కోరంగే జంగు వ్యవసాయ పొలంలో ఎద్దులు మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ దాదాపు రూ. 50 వేల వరకు ఉంటుందన్నారు.

సన్మానం

బోథ్: ఆదిలాబాద్ తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షురాలు తన్నీరు నవత, ప్రధాన కార్యదర్శి ఆసం రమాదేవిలను బోథ్ పట్టణ పద్మశాలి సంఘం సభ్యులు గురువారం స్థానిక మార్కండేయ ఆలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

కైలాస్‌నగర్: తెలంగాణ పంచాయతీ కార్యదర్శిల సెంట్రల్ ఫోరమ్ డైరీ–2025ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఏ.నవీన్ కుమార్‌ల ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసిన పంచాయతీ కార్యదర్శులు పూలమొక్కను అందజేశారు. నాయకులు సంజీవ్ రావు, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవం



పూజలు చేస్తున్న నాయకులు

తాంసి: మండల కేంద్రంలో గురువారం భారతీయ కిసాన్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ ఆలయం వద్ద బలరాముడి చిత్రపటానికి పూజలు చేసి, వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, భూమారెడ్డి, జిల్లా కార్యదర్శి చిల్కూరి వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఉమాకాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సంతోశ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు



సంబురాలు జరుపుకొంటున్న బీజేపీ నాయకులు



టపాసులు కాల్చుతున్న బీజేపీ నాయకులు

నేరడిగొండ: ఎమ్మెల్సీ ఎన్నికల విజయం సందర్భంగా మండలంలో బీజేపీ నాయకులు విజయోత్సవ సంబరాలను జరుపుకున్నారు. గురువారం మండల కేంద్రంలో బాణసంచాలు పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అంతకు ముందు బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: తెలంగాణ రాష్ట్రంలో రానున్న రోజులు బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని మాజీ జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్న మైల్ అంజిరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో గురువారం మండల కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, ఆర్క ఖమ్ము, శివకుమార్ జైస్వాల్, ఆడప్ చంపత్‌రావ్, మారుతి దేవ్‌పూజే, రాథోడ్ రాధిక, ముండే రాజేశ్వర్, కోవా రాజేశ్వర్, కనక హన్మంత్‌రావు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు గురువారం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల గెలుపుపై సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా మా గెలుపును అడ్డుకోలేక పోయిందన్నారు. నియోజకవర్గం కన్వీనర్ బోయర్ విజయ్, బోనిగిర్‌వార్ గణేష్, రామెల్లి మోరేశ్వర్, ఇంద్రశేఖర్, ఠాక్రే సందీప్, సలాం దేవ్‌రావు, రాము, నవీన్, జీవన్ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఆసుపత్రి సూపరింటెండెంట్

ఉట్నూర్‌రూరల్: అదుపు తప్పి కిందపడి అపస్మారక స్థితిలోకి చేరుకున్న వ్యక్తికి సకాలంలో వైద్యం అందించి మానవత్వం చాటుకున్నాడు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్. మండలంలోని బొప్పరికుంట గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తి కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. సమయంలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్ ఉట్నూర్‌కి వస్తున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మణ్‌ను తన కారులో ఎక్కించి ఉట్నూర్ ఆసుపత్రికి తీసుకువచ్చాడు. వెంటనే ఆయనకు ప్రథమ చికిత్స అందించడంతో ప్రస్తుతం లక్ష్మణ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, సకాలంలో వైద్యం అందించడంతో ప్రాణాలు కాపాడిన డాక్టర్‌ను పలువురు అభినందించారు.



వైద్యం అందిస్తున్న డాక్టర్ ఉపేందర్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తలమడుగు: మండలంలోని ఆర్లి(కె) గ్రామంలో శ్రీశబరిమాత ఆలయ 37వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. శబరిమత ఆలయ పల్లకి ఊరేగింపు చేపట్టారు. సామాజిక కార్యకర్త ముడుపు మానిష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సకినాపూర్, రుయ్యాడి, బరంపూర్, దేవాపూర్, ఆదిలాబాద్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు సత్యనారాయణ, వినోద్, నారాయణ, సురేందర్ రెడ్డి, రాజు, సాగర్‌రెడ్డి, శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు.



పల్లకి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం ఇంటర్మీడియట్ పూర్తికానున్న విద్యార్థులు ప్రవేశం తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ అతీక్ బేగం అన్నారు. ఇచ్చోడ, గుడిహత్నూర్ మండల కేంద్రాలలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద గురువారం అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్య బోధన జరుగుతుందన్నారు. విద్యతోపాటు ఆటపాటల్లో రాణించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి రఘు, కోటయ్య, ముబారక్, నరేశ్, గోపాల్ పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న కళాశాల సిబ్బంది

పొంచి ఉన్న ప్రమాదం..



ఇచ్చోడ: సిరిచెల్మ వెళ్లే రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రెండు రోజుల క్రితం సిరిచెల్మలో జాతర ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముధోల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు ముధోల్ సీఐ మల్లేశ్, ఎస్సై సందీప్ తెలిపారు. మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోకేశ్వరం నుంచి ముధోల్‌కు అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను విఠోలి గ్రామ సమీపంలో పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.



పట్టుకున్న ట్రాక్టర్ల వద్ద పోలీసులు